



# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 270 | మంగళవారం 27- అక్టోబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## చైనా సముద్రంలో కూలిన అమెరికా విమానాలు



**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** ప్రపంచం దృష్టి ఒక్కసారిగా చైనా వైపు మళ్లింది. ఎందుకంటే దక్షిణ చైనా సముద్రంలో 30 నిమిషాల వ్యవధిలో రెండు US నేవీ విమానాలు కూలిపోయాయి. రెండు ప్రమాదాలు వేర్వేరు సమయంలో జరిగాయి. మొదటి సంఘటనలో MH-60R సీహాక్ హెలికాప్టర్ ఆదివారం మధ్యాహ్నం 2:45 గంటలకు కూలిపోయింది. USS నిమిట్జ్ విమాన వాహక నౌక నుంచి హెలికాప్టర్ సాధారణ వ్యాయామాలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటన జరిగిన దాదాపు 30 నిమిషాల తర్వాత, మధ్యాహ్నం 3:15 గంటలకు అదే నౌక నుంచి F/A-18F సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్ కూడా కూలిపోయింది.

ప్రమాదంపై చైనా స్పందన ఏంటంటే..

సైనిక వ్యాయామం సందర్భంగా ఈ ప్రమాదాలు జరిగాయని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రమాదాల తర్వాత అమెరికాకు మానవతా సహాయం అందించడానికి చైనా సిద్ధంగా ఉందని మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ పేర్కొన్నారు. అయితే ఒకే నౌకలో ఇంత తక్కువ సమయంలో ఈ రెండు ప్రమాదాలు ఎలా జరిగాయనే దానిపై అమెరికా నావికాదళం దర్యాప్తు ప్రారంభించింది. ఆ సమయంలో రెండు విమానాలు ఏ మిషన్ లేదా ఆపరేషన్‌లో నిమగ్నమై ఉన్నాయో అమెరికన్ నేవీ వెల్లడించలేదు.

## 'ఆ మంత్రిని వెంటనే కేబినెట్ నుంచి తొలగించండి'

### సీఎం రేవంత్‌కు బండి సంజయ్ విజప్తి



**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కేబినెట్ లోని కొందరు మంత్రులు మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకుని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణ జరిపి నివేదిక తెప్పించుకోవాలని కోరారు. అలాంటి మంత్రులను కేబినెట్ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎంఐఎంకు చెందిన రౌడీషీటర్లు పోలీసులను చంపినా, హత్యాయత్నం చేసే స్థాయికి పెట్రేగిపోతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందన్నారు. జూబ్లీహిల్స్ లో ఒకవర్గం ఓట్ల కోసం ఎంఐఎం కాళ్లు పట్టుకునే స్థాయికి కాంగ్రెస్ పార్టీ దిగజారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోకి రావాలంటే యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.


సర్దార్ వల్లభాయి పటేల్ 150 జయంతి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం కరీంనగర్‌లోని మేరా యువ భారత్ కార్యాలయంలో మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

## ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



## దేశంలో 22 నకిలీ విశ్వవిద్యాలయాలు..

### లిస్ట్ రిలీజ్ చేసిన యూజీసీ



**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** భారత్ లోని 22 విశ్వవిద్యాలయాలను నకిలీ విశ్వవిద్యాలయాలుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రకటించింది. నకిలీ విశ్వవిద్యాలయాల జాబితాలో ఢిల్లీ అగ్రస్థానంలో ఉంది. యూజీసీచట్టబద్ధమైన విశ్వవిద్యాలయాలుగా చెప్పుకుంటూ ప్రవేశాలు కల్పిస్తూ, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న 22 సంస్థల జాబితాను యూజీసీ విడుదల చేసింది. ఈ సంస్థల నుంచి పొందిన ఏ డిగ్రీ అయినా చెల్లదని అభ్యర్థులు గమనించాలి. యూజీసీ రాష్ట్రాల వారీగా నకిలీ సంస్థల జాబితా ప్రకారం, ఢిల్లీలో అత్యధికంగా 10 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. దీని తరువాత ఉత్తరప్రదేశ్‌లో నాలుగు, ఆంధ్రప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో రెండు, మహారాష్ట్ర, పుదుచ్చేరిలో ఒక్కొక్కటి ఉన్నాయి. ఏదైనా విశ్వవిద్యాలయం లేదా సంస్థలో చేరే ముందు ఆ విశ్వవిద్యాలయం లేదా సంస్థ గుర్తింపును తనిఖీ చేయాలని యూజీసీ విద్యార్థులందరినీ హెచ్చరించింది.

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

### కొత్తగా 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు, తీరనున్న కష్టాలు



**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ నగర ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు గుడ్‌న్యూస్. త్వరలో రద్దీ కష్టాలు తీరిపోనున్నాయి. దేశంలో సుస్థిరమైన, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థను రూపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రభుత్వ రంగ సంస్థ కన్వెర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ దేశంలోనే అతిపెద్ద విద్యుత్ బస్సుల సేకరణ కోసం సిద్ధమవుతోంది. మొత్తం 10,900 విద్యుత్ బస్సుల కోసం దాఖలైన బిడ్లను నవంబరు 6న ఓపెన్ చేయనుంది.

ఈ టెండర్ ద్వారా సేకరించనున్న 10,900 బస్సులను దేశంలోని ప్రధాన మెట్రో నగరాలకు కేటాయించనున్నారు. ముఖ్యంగా, రద్దీ సమస్యలు అధికంగా ఉన్న నగరాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా.. హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చనున్నారు.

## ఎన్నికల కమిషన్ కీలక ప్రకటన..

### దేశంలోని 12 రాష్ట్రాల్లో SIR రెండవ దశ ప్రారంభం



**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో దేశవ్యాప్తంగా SIR ను ప్రకటించారు. ఈ సమావేశంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ.. 12 రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటరు జాబితాల రెండవ దశను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ దశలో ఓటరు జాబితాను అప్ డేట్ చేయడం, కొత్త ఓటర్లను యాడ్ చేయడం, లోపాలను సరిదిద్దడం ఉంటాయని తెలిపారు. SIR నవంబర్ 4న ప్రారంభం కానుంది. తుది ఓటర్ల జాబితా ఫిబ్రవరి 7, 2026న ప్రచురించనున్నారు. ఈ ప్రక్రియ అనేక దశల్లో పూర్తవుతుంది.

## తెలంగాణలో ముగిసిన మద్యం షాపుల డ్రా ప్రక్రియ




## కాంగ్రెస్ వల్ల తెలంగాణలో గన్ కల్చర్

### బీజేపీ చీఫ్ రామచందర్ రావు



## ఛీ.. ఛీ.. అయ్యప్ప మాల వేసుకొని ఈ పనేంటి స్వామి..!





## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అలర్ట్..

- మొత్తం సహాయంలో మార్పుల్లేవు
- ఉపాధి హామీ పథకంతో అనుసంధానం
- కొత్త చెల్లింపు షెడ్యూల్ ఇలా
- మూడు విధాలుగా లబ్ధిదారులకు లాభం
- లబ్ధిదారులకు మంత్రి సూచన

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' లబ్ధిదారులకు అందించే రూ. 5 లక్షల ఆర్థిక సహాయం చెల్లింపుల ప్రక్రియలో స్వల్ప మార్పులు చేసినట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మొత్తం మంజూరు చేసే మొత్తంలో ఎలాంటి మార్పు ఉండదని, కేవలం విడుదల చేసే షెడ్యూల్‌లో మాత్రమే ఈ మార్పులు చేశామని మంత్రి స్పష్టం చేశారు.

చెల్లింపుల మార్పునకు కారణం..

ఈ చెల్లింపుల షెడ్యూల్‌లో మార్పు చేయడానికి ప్రధాన కారణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని జాతీయ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయడం. ఇళ్ల నిర్మాణంలో భాగంగా 90 పని దినాల వేతనం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం కేటాయించిన నిధులను కూడా లబ్ధిదారులకు అందించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఉపాధి హామీ పథకం ద్వారా లభించే ఈ అదనపు ప్రయోజనం (90 రోజుల పనిదినాల మొత్తం, మరుగుదొడ్డి నిర్మాణం నిమిత్తం నిర్దేశించిన మొత్తం) లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అవుతుంది.

ఈ నిధుల అనుసంధానం కారణంగా పరిపాలనా సౌలభ్యం కోసం చెల్లింపుల షెడ్యూల్‌లో మార్పు అనివార్యమైందని మంత్రి వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నాలుగు విడతలుగా బిల్లులు చెల్లిస్తున్నారు. మొదటి విడతలో భాగంగా.. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. 1,00,000 విడుదల అవుతుంది.

రెండవ విడతలో.. రూఫ్ లెవల్ వరకు నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ. 1,00,000 విడుదల అవుతుంది. మూడవ విడతలో భాగంగా.. ప్రస్తుతం స్లాబ్ వేసిన తర్వాత లబ్ధిదారులకు రూ. 2,00,000 చెల్లిస్తున్నారు. ఉపాధి హామీ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతున్న నేపథ్యంలో.. స్లాబ్ పూర్తయ్యాక చెల్లించే మొత్తాన్ని రూ. 1,60,000 (ఒక లక్షా అరవై వేలు)గా ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మిగిలిన రూ. 1,00,000 విడుదల అవుతుంది.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులు ఈ నూతన చెల్లింపు షెడ్యూల్‌ను గమనించి, ప్రభుత్వంతో సహకరించాలని కోరారు. ఈ పథకం ద్వారా తెలంగాణలోని నిరుపేదలకు సొంత ఇల్లు, మరుగుదొడ్డి , ఉపాధి రూపంలో మూడు విధాలుగా ప్రయోజనం లభించనుంది.

## జూబ్లీహిల్స్‌లో నిబంధనలు ఉల్లంఘించిన బీఆర్ఎస్

### ఆధారాలతో ఈసీకి కాంగ్రెస్ కంప్లైంట్




## డీప్‌ఫేక్ ఘటనలపై స్పెషల్ టీమ్..

### చిరంజీవి కేసుపై సీపీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు



## రియాజ్ కుటుంబానికి పోలీసుల వేధింపులు..

### మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు..!



# ఛీ.. ఛీ.. అయ్యప్ప మాల వేసుకొని ఈ పనేంటి స్వామి..!

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):**హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన దీక్షల్లో అయ్యప్ప మాల ధారణ ఒకటి. ముఖ్యంగా కార్తీక మాసంలో ప్రారంభమయ్యే 41 రోజుల ఈ కఠిన వ్రతం భక్తులు స్వామి అయ్యప్పపై తమకు ఉన్న భక్తిని, నిష్టను చాటుకునేందుకు చేపడతారు. మాల ధరించిన ప్రతి భక్తుడు శారీరక, మానసిక పవిత్రతను పాటిస్తూ.. మద్యపానం, మాంసాహారం వంటి వాటికి దూరంగా ఉండి బ్రహ్మచర్యాన్ని పాటించడం ఆనవాయితీగా వస్తుంది. అలాంటి పవిత్రమైన అయ్యప్ప మాలను ధరించి ఉన్న ఓ వ్యక్తి.. నిష్టకు పూర్తిగా విరుద్ధంగా రహస్యంగా మద్యం తాగుతూ తోటి స్వాములకు అడ్డంగా దొరికిపోయాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ ప్రాంతంలో జరిగినట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ వీడియో చూస్తే నిజంగా భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉంది. ఇక వైరల్ అవుతున్న వీడియోలో అయ్యప్ప మాల ధరించిన సదరు వ్యక్తి ఒక గదిలో కూర్చుని రహస్యంగా బీరు తాగుతుండగా.. అకస్మాత్తుగా తోటి స్వాములు గదిలోకి ప్రవేశించారు. వారిని చూడగానే మాల ధరించిన ఆ వ్యక్తి ఒక్కసారిగా కంగారుపడుతూ తాను తాగుతున్న బీర్ బాటిల్ ను కుర్చీ కింద దాచి పెట్టె ప్రయత్నం చేశాడు. అలాగే తన ముఖాన్ని దాచుకుంటూ అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా.. తోటి స్వాములు అతడిని అడ్డుకున్నారు.

ఇక అక్కడి తోటి మాలదారులు ఆగ్రహంతో.. "మనిషివా పశువువా? ఇదేం బుద్ధి తక్కువ వ్యవహారం? మద్యానికి దూరంగా ఉండలేకపోతే మాల తీసేయాలి.. అంతే తప్ప ఇదా పద్ధతి?" అంటూ మండిపడ్డారు. ఈ సంఘటన మొత్తాన్ని తోటి భక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో సర్క్యులేట్ కావడంతో భక్తులు, నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. కొత్తగా 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు, తీరనున్న కష్టాలు

ఈ కొత్త విద్యుత్ బస్సుల రాకతో హైదరాబాద్ నగరంలోని ప్రయాణికులకు గొప్ప ఊరట లభించనుంది. ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలా బస్సుల్లో కాలు పెట్టేందుకు కూడా జాగా ఉండటం లేదు. ఇక ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తాజాగా కేటాయించిన 2,000 విద్యుత్ బస్సులు నగరంలో ప్రవేశిస్తే, ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. ఈ అధునాతన, పర్యావరణహిత బస్సులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాన్ని, సురక్షితమైన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురానున్నాయి. అంతేకాకుండా.. గ్రేటర్ హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించి, నగరానికి 'గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్' గుర్తింపును తీసుకురావడంలో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తాయి. బిడ్ల ఓపెనింగ్ తర్వాత బస్సుల పనులు వేగవంతమై త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు.

నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్ కింద ఈ బస్సులను సేకరిస్తున్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి, వాయు కాలుష్యాన్ని నివారించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం. సీఈఎస్ఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టెండర్ ప్రక్రియలో పలు దేశీయ, అంతర్జాతీయ బస్సు తయారీదార్లు, ఆపరేటర్లు ఆసక్తి చూపినట్టు కంపెనీ తెలిపింది.

# డీప్‌ఫేక్ ఘటనలపై స్పెషల్ టీమ్.. చిరంజీవి కేసుపై సీపీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):**టాలివుడ్ నటుడు, మెగాస్టార్ చిరంజీవి డీప్‌ఫేక్ కేసు విచారణపై హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పందించారు. టెక్నాలజీ పెరుగుతున్న క్రమంలో ఇటీవల సెలబ్రిటీలు, నేతలు, ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా డీప్‌ఫేక్ బారిన పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి కూడా డీప్‌ఫేక్ బారినపడ్డారు. మెగాస్టార్ చిరంజీవి ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో కేటుగాళ్లు పోస్ట్ చేశారు. దీంతో అవి వైరల్‌గా మారాయి. ఇది గమనించిన ఆయన వెంటనే సీపీ సజ్జనార్‌కు తాజాగా ఫిర్యాదు చేశారు. డీప్‌ఫేక్ వీడియోలు రూపొందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చిరంజీవి విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ వ్యవహారంపై తాజాగా సజ్జనార్ మాట్లాడుతూ.. చిరంజీవి డీప్‌ఫేక్ కేసులో విచారణ చేస్తున్నామని తెలిపారు. డీప్ ఫేక్ వీడియోలు, ఫొటోలు మార్ఫింగ్ వంటివి సమాజిక మాధ్యమాల్లో విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. సెలబ్రిటీల ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసే కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి విచారణ చేస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ టీమ్ ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో విచారణ చేపడుతుందన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే.. వారు తప్పించుకోలేరని, కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

# రియాజ్ కుటుంబానికి పోలీసుల వేధింపులు.. మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు..!

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):**ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన షేక్ రియాజ్ కుటుంబ సభ్యులు సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించారు. తన కొడుకు ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన పరిస్థితులు, ఆ తరువాత పోలీసులు తమను వేధిస్తున్న తీరుపై రియాజ్ తల్లి, భార్య, పిల్లలు కమిషన్ చైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో రియాజ్ కుటుంబ సభ్యులు తమను స్వగ్రామంలోకి కూడా రానివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, తీవ్రంగా వేధింపులకు గురిచేస్తూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని కమిషన్‌కు వివరించారు.

మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్‌తో రియాజ్‌కు ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవలు ఉన్నాయని రియాజ్ కుటుంబ సభ్యులు కమిషన్‌కు వివరించారు. రియాజ్ భార్య తన ఫిర్యాదులో.. కానిస్టేబుల్ ప్రమోద్ ఒక కేసు విషయంలో రియాజ్‌ను రూ. 3 లక్షలు డిమాండ్ చేశారని.. రియాజ్ అప్పటికప్పుడు రూ. 30 వేలు చెల్లించాడని తెలుపుతూ.. మిగతా డబ్బులు ఇవ్వాలని ప్రమోద్ రియాజ్‌ను తీవ్రంగా వేధించారని ఆరోపించింది. ఇకపోతే ఈ ఎన్‌కౌంటర్ ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గతంలోనే సుమోటోగా కేసు స్వీకరించింది. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను వచ్చే నెల (నవంబర్) 24వ తేదీలోపు సమర్పించాలని రాష్ట్ర డీజీపీకి కమిషన్ చైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్ ఆదేశించారు.

తాజాగా, రియాజ్ కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కమిషన్ చైర్మన్.. నివేదిక సమర్పణ గడువును మరింత తగ్గిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల 3వ తేదీలోపు నివేదికను సమర్పించాలని డీజీపీని ఆదేశించారు. ఈ ఎన్‌కౌంటర్ వ్యవహారం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు దృష్ట్యా రాష్ట్ర పోలీసులకు మరింత త్వరగా నివేదిక ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):**ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయంపై తీసుకుంది. నేడు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును సాంకేతికంగా, ఆర్థికంగా పునరుద్ధరించేందుకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి సుందిళ్ల లింక్ ద్వారా సవరించిన సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం అధ్యయనం చేసిందని వెల్లడించారు. సవరించిన ప్రణాళిక వల్ల ప్రాజెక్టు వ్యయం దాదాపు 10 నుండి 12 శాతం వరకు తగ్గుతుందని మంత్రి తెలియజేశారు. భూసేకరణ కూడా దాదాపు సగానికి తగ్గుతుందని, మునుపటి ప్రణాళికలతో పోలిస్తే సుమారు రూ.1,500 నుంచి 1,600 కోట్ల వరకు ఆదా చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా వివరించారు.

# 'ఆ మంత్రిని వెంటనే కేబినెట్ నుంచి తొలగించండి' సీఎం రేవంత్‌కు బండి సంజయ్ విజప్తి

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయిపటేల్ జన్మించి ఈనెల 31 నాటికి 150 ఏళ్లు. సర్దార్ వల్లభాయి పటేల్ ఆనాడు దేశంలోని 560 సంస్థానాలను ఒక్క జెండా కిందకు తీసుకొచ్చి భారతదేశాన్ని ఏకం చేశారు. భారత్ తోనే కాదు... తెలంగాణతోనూ ఉన్న అనుబంధం గురించి ఈ తరానికి తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది. పటేల్ లేకపోతే తెలంగాణకు విముక్తి కలిగేది కాదు. తెలంగాణను పాకిస్తాన్‌లో కలపాలని లేదా ముస్లిం దేశంగా మార్చాలని ఆనాడు నిజాం రాజు కుట్రలు చేసిండు. ఒకవేళ తెలంగాణ భారత్‌లో విలీనం కాకుండా మన పరిస్థితి ఎట్లుండేదో ఒక్క క్షణం ఆలోచించండి. మరో పాకిస్తాన్, మరో శ్రీలంక, మరో బంగ్లాదేశ్‌లా మారి ఆకలి కేకలతో కల్లోల దేశంగా మారేది. ఇది ఆనాడే గ్రహించిన పటేల్ తెలంగాణకు స్వాతంత్ర్యం రాకుండా స్వతంత్ర్య రాజ్యంగా ఉంటే భారతమాత కడుపులో కేన్సర్ ఉన్నట్లేనని ప్రకటించి నిజాం కుట్రలను భగ్నం చేసి తెలంగాణకు విముక్తి కల్పించిన సర్దార్ పటేల్ మనందరికీ ఆరాధ్యుడు.

అలాంటి మహనీయుడిని 150 జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకునేలా, ఆయన సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు "సర్దార్‌ఏ150 ఐక్యతా మార్చ్" పేరిట అనేక కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది. ప్రతి జిల్లాలో విద్యార్థులను, యువతతో కలిసి పాదయాత్రలు చేయాలని సంకల్పించింది. సర్దార్ పటేల్ జన్మస్థలమైన కరంసాద్ నుండి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (కేవాడియా) వరకు మొత్తం 152 కి.మీ.ల మేరకు జాతీయ పాదయాత్ర (నవంబర్ 26 నుండి డిసెంబర్ 6 వరకు) నిర్వహిస్తారు. ప్రధానమంత్రి మోడీ ఒకరోజు జాతీయ పాదయాత్రలో పాల్గొంటారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో "సర్దార్‌ఏ150 ఐక్యతా మార్చ్" పేరిట జరిగే పాదయాత్రలో నేనూ పాల్గొంటాను. సర్దార్ పటేల్ ఈ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించి యువతలో ఐక్యతా స్ఫూర్తిని నింపాలని మీడియాను, సోషల్ మీడియా వారియర్స్‌ను కోరుతున్నా.

రాష్ట్ర కేబినెట్‌లోని కొందరు మంత్రులు మహిళా అధికారులను రాత్రిపూట ఇండ్లకు, ఆఫీసులకు పిలిపించుకుని వేధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. కష్టపడి చదువుకుని ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్న మహిళలను గౌరవించాల్సింది పోయి అవమానించేలా వ్యవహరించడం సరికాదు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే విచారణ జరిపించి నివేదిక తెప్పించుకోవాలి. బాధ్యులైన మంత్రులను బర్త్ రఫ్ చేయాలి.

ఇప్పటికే కాంగ్రెస్ పాలన అంటేనే మహిళలు అసహ్యించుకునే పరిస్థితి ఉంది. అవినీతి, అరాచకాలు జరుగుతున్నాయి. ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారు. ముఖ్యంగా మహిళలకు ప్రతినెలా రూ.2500లు, తులం బంగారం, స్కూటీ ఇస్తానని మోసం చేశారు. వీటికి తోడు శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయి. సాక్షాత్తు పోలీసులపై దాడులు చేస్తున్నరు. మొన్న నిజామాబాద్‌లో మజ్లిస్ రౌడీషీటర్ కానిస్టేబుల్‌ను చంపేశారు. నిన్న హైదరాబాద్ నడిబొడ్డున డీసీపీ చైతన్య, కానిస్టేబుల్‌పై ఎంఐఎం రౌడీషీటర్ దాడి చేసి హత్యాయత్నం చేసినా దిక్కు లేదు. గోరక్షులపై కాల్పులు జరిపి చంపేందుకు యత్నిస్తున్నారు. మేం బాధితులకు అండగా వెళ్లి పోలీసులను పరామర్శిస్తే.. మజ్లిస్ నేతలు మాత్రం రౌడీషీటర్లను పరామర్శిస్తూ వారికి కొమ్ము కాస్తున్నారు. ఎంఐఎం ఓట్ల కోసం జూబ్లీహిల్స్‌లో గెలవడానికి ఆ పార్టీ కాళ్లు మొక్కుతున్నారు. ఆనాడు బీఆర్ఎస్ కూడా ఎన్నికల్లో గెలిచేందుకు కాళ్లు మొక్కిన దుస్థితి. ఈ రెండు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడల్లా ఎంఐఎంను పెంచి పోషిస్తున్నాయే శాంతి భద్రతలు పట్టడం లేదు. అందుకే ఆ పార్టీల కోసం ఒవైసీ బిహార్‌ను వదిలి జూబ్లీహిల్స్‌లో తిష్టవేసి ముస్లిం ఓట్ల కోసం ప్రచారం చేస్తున్నారు.

ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయం మానుకోవాలి. డీసీపీ చైతన్యపై హత్యాయత్నం చేసిన రౌడీషీటర్‌పై కఠినాతి కఠినంగా చర్యలు తీసుకోవాలి. యూపీ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలి. అక్కడ రౌడీషీటర్లకు బెయిల్ వచ్చినా బయటకు రాకుండా జైల్లోనే ఉండే పరిస్థితి. అట్లాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప రౌడీషీటర్లను కంట్రోల్ చేయాలి.

దురదృష్టం ఏమిటంటే... రాష్ట్ర ముఖ్యమంత్రే నక్సలిజం నా ఫిలాసఫీ అంటారు. ఒవైసీ మంచోడని అంటారు. అక్బరుద్దీన్ ఒవైసీ కొడంగల్‌లో పోటీ చేస్తే గెలిపిస్తానని అంటారు. హైదరాబాద్ నడిబొడ్డున డీసీపీపై హత్యాయత్నం జరిగినా పట్టించుకోరు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎంఐఎం వద్ద మోకరిల్లుతున్నరు. ఇది సరికాదు. శాంతిభద్రతలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# జూబ్లీహిల్స్‌లో నిబంధనలు ఉల్లంఘించిన బీఆర్ఎస్ ఆధారాలతో ఈసీకి కాంగ్రెస్ కంప్లైంట్

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడారు. మేం ఏం చేసినా చెల్లుతుందన్న అహంకారంతో బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రెండు మీడియా ఛానళ్లతో బీఆర్ఎస్ విచ్చలవిడిగా తప్పుడు ప్రచారం చేయిస్తోందని అన్నారు. మీడియా ఛానళ్లు అన్ని పార్టీలను సమానంగా చూడాలి.. ప్రజల తరపున పనిచేయాలని.. కానీ ఆ రెండు ఛానళ్లు మాత్రం కేవలం బీఆర్ఎస్ కోసమే పనిచేస్తున్నాయని తీవ్ర విమర్శలు చేశారు. ఈ రెండు పత్రికల్లో వచ్చే వార్తలను అడ్వటైజ్మెంట్‌గా పరిగణించి బీఆర్ఎస్ అభ్యర్థి ఖర్చుగా చూడాలని ఈసీని కోరారు. మీడియా మానిటరింగ్ కమిటీ ఆమోదం లేకుండా ఎలాంటి వీడియోలు ప్రచారం చేయడానికి వీలు లేదని అన్నారు. అన్ని ఆధారాలతో రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశాం.. తప్పుని సరిగా చర్యలు తీసుకుంటారని నమ్ముతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.

మేం కూడా కేసీఆర్ చరిత్ర తవ్వాలా?: శ్రీగణేష్ , ఎమ్మెల్యే కంటోన్మెంట్

ఎన్నికలు పారదర్శకంగా జరగాలి.. నిబంధనల ఉల్లంఘన జరగడానికి వీల్లేదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బీఆర్ఎస్ అనేక ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఫొటో పెట్టి పోలింగ్ స్లిప్పులను పంచి పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో బహిరంగంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఇప్పటికే జూబ్లీహిల్స్ ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పైన తప్పుడు ప్రచారం చేయాల్సిన అవసరం మాకు లేదని అన్నారు. ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ అభ్యర్థికి ఉందని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండి కూడా అక్రమాలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ దొంగతనంగా పోల్ చిట్టీలు పంచుతోందని అన్నారు. కేటీఆర్ పొంకనాలు కొడుతున్నాడు.. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓడిపోవాలని కేటీఆర్ చూస్తున్నట్టున్నాడని అనుమానం వ్యక్తం చేశారు. ఓడిపోతామని తెలిశాక బీఆర్ఎస్ అనేక పిచ్చి నాటకాలు చేస్తోందని మండిపడ్డారు.

## తెలంగాణలో ముగిసిన మద్యం షాపుల డ్రా ప్రక్రియ

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):**తెలంగాణలో మద్యం షాపుల డ్రా ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2620 షాపులకు సోమవారం అధికారులు, కలెక్టర్ల సమక్షంలో ఎక్సైజ్ శాఖ అధికారులు డ్రా తీశారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా కొత్త వైన్స్ షాపుల నిర్వహణ కొనసాగనుంది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో మద్యం షాపులు దక్కించుకునేందుకు కొందరు సిండికేటై టెండర్లు వేశారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై విపక్షాలు నెగిటివ్ ప్రచారం చేస్తుండటంతో యువకులు, వ్యాపారులు మద్యం వ్యాపారంపై పలువురు కన్నేశారు. పలుచోట్ల గ్రూపుగా ఏర్పడి ఎక్కువగా దరఖాస్తులు వేశారు. గ్రూపుగా కావడంతో పాటు ఫీజు పెంపు కారణంగా దరఖాస్తులు తగ్గినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ.3లక్షలు ఫీజు పెట్టిన విషయం తెలిసిందే. ఎంపికైన దరఖాస్తు దారులు అదే రోజు గానీ, మరుసటి రోజు గానీ షాప్ ఎక్సైజ్ పన్ను మొదటి వాయిదాను చెల్లించి షాపు కేటాయింపు నిర్ధారణ లేఖ తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# ఎన్నికల కమిషన్ కీలక ప్రకటన..

## దేశంలోని 12 రాష్ట్రాల్లో SIR రెండవ దశ ప్రారంభం

ఇప్పటివరకు, దేశం 1951, 2004 మధ్య ఎనిమిది స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్స్ (SIRs) నిర్వహించింది. రాజకీయ పార్టీలు అనేక సందర్భాల్లో ఓటర్ల జాబితాల నాణ్యత సమస్యను లేవనెత్తాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. కాగా బీహార్‌లో ఓటర్ల జాబితాకు సంబంధించిన SIR ప్రక్రియ ఇప్పటికే పూర్తైన విషయం తెలిసిందే. దాదాపు 74.2 మిలియన్ల పేర్లతో కూడిన తుది జాబితా సెప్టెంబర్ 30న ప్రచురించారు. బీహార్‌లో పోలింగ్ నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరుగనుంది. ఫలితాలు నవంబర్ 14న ప్రకటించనున్నారు.

నేటి నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రారంభమయ్యే 12 రాష్ట్రాలు

తొమ్మిది రాష్ట్రాలు:

ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ మరియు రాజస్థాన్.

కేంద్రపాలిత ప్రాంతాలు:

అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరితో సహా మూడు కేంద్రపాలిత ప్రాంతాలు.

ఈ ప్రక్రియలో, బూత్ లెవల్ అధికారులు (BLOలు) ప్రతి ఓటరు ఇంటిని కనీసం మూడుసార్లు సందర్శించి కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడానికి, ఏవైనా తప్పులను సరిదిద్దుతారని CEC జ్ఞానేష్ కుమార్ అన్నారు. జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ, BLOలు ఇంటింటికీ వెళ్లి ఫారం-6, డిక్లరేషన్ ఫారాలను సేకరించి, కొత్త ఓటర్లు ఫారాలను నింపడానికి, ERO (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) లేదా AERO (అసిస్టెంట్ ERO)కి అందజేస్తారు అని అన్నారు.

రెండవ దశ శిక్షణ మంగళవారం ప్రారంభమవుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. అన్ని ప్రధాన ఎన్నికల అధికారులు (CEOలు), జిల్లా ఎన్నికల అధికారులు (DEOలు) రాబోయే రెండు రోజుల్లో రాజకీయ పార్టీలతో సమావేశమై SIR ప్రక్రియపై వారికి వివరించాలని ఆయన ఆదేశించారు. ఏ పోలింగ్ స్టేషన్‌లోనూ 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉండరని జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ వల్ల తెలంగాణలో గన్ కల్చర్ బీజేపీ చీఫ్ రామచందర్ రావు

**న్యూస్ డెస్క్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వలన గన్ కల్చర్ పెరిగిందని బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేసారు. నేడు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతోమాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, రైతులను మోసం చేస్తోందని, రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతోందని, సాధారణ వ్యక్తులకే కాక పోలీసులకు కూడా రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు బేడీలు వేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పోలీసుల కాళ్లు పట్టుకునే దుస్థితికి తీసుకొచ్చిందని మండిపడ్డారు. రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కానీ వారు పంటను అమ్మలేని దైన్య స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు బెనిఫిట్స్, పింఛన్ ఇవ్వడం లేదని, రెండేళ్లుగా బెనిఫిట్స్ రాకపోవడంపై ముఖ్యమంత్రికి లేఖ రాసినా ఎలాంటి స్పందన లేదని, ఐదు డీఏలు పెండింగ్‌లో తీఉన్నాయని ఆయన ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే రౌడీ షీటర్లపై కేసులు ఎత్తివేసి, వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుందని, మజ్లీస్‌తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి భద్రతలను దెబ్బతీస్తోందని రామచందర్‌రావు తీవ్ర ఆరోపణలు చేసారు.

## చైనా సముద్రంలో కూలిన అమెరికా విమానాలు..

అరగంటలోపు ఒకే నౌక నుంచి రెండు విమానాలు కూలిపోయిన సంఘటనను సైనిక నిపుణులు అనుమానాస్పదంగా పరిగణిస్తున్నారు.

దక్షిణ చైనా సముద్రం భౌగోళిక రాజకీయ దృక్కోణం నుంచి సున్నితమైన ప్రాంతం. చైనా మొత్తం సముద్ర ప్రాంతాన్ని ఇది క్లెయిమ్ చేస్తుందని డ్రాగన్ వాదన. అయితే అంతర్జాతీయ న్యాయస్థానం ఇప్పటికే బీజింగ్ వాదనను చట్టవిరుద్ధమని ప్రకటించింది. అయినప్పటికీ చైనా ఇటీవల సంవత్సరాలలో ఇక్కడ సైనిక స్థావరాలు, కృత్రిమ దీవులను నిర్మించింది. ఈ జలాల్లో నావిగేషన్ స్వేచ్ఛను కాపాడుకోవడానికి అమెరికా ఓడలు, విమానాలను మోహరిస్తుంది. యుఎస్ఎస్ నిమిట్జ్ ప్రపంచంలోనే అతిపెద్ద, పురాతనమైన యుఎస్ విమాన వాహక నౌకలలో ఒకటి. ఇది 2026 లో సేవల నుంచి వైదొలగనుంది. ఈ ఓడ నుంచి బయలుదేరిన హెలికాప్టర్, విమానం రెండు 30 నిమిషాల వ్యవధిలో ప్రమాదానికి గురయ్యాయి.

# దేశంలో 22 నకిలీ విశ్వవిద్యాలయాలు.. లిస్ట్ రిలీజ్ చేసిన యూజీసీ

నకిలీ విశ్వవిద్యాలయం నుండి పొందిన డిగ్రీకి చట్టపరమైన లేదా విద్యాపరమైన విలువ ఉండదని స్పష్టం చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లోని రెండు సంస్థలు నకిలీవని తేలింది.

1. గుంటూరులోని రెండు వేర్వేరు చిరునామాల నుంచి పనిచేస్తున్నట్లు తేలిన క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ విశ్వవిద్యాలయం. 2. విశాఖపట్నంలోని ఎన్జిఓ కాలనీలో ఉన్న బైబిల్ ఓపెన్ యూనివర్శిటీ ఆఫ్ ఇండియా. ఈ సంస్థలు మతపరమైన లేదా వేదాంత అధ్యయనాలలో డిగ్రీలను అందిస్తాయి కానీ యూజీసీ ద్వారా గుర్తించబడలేదు.

ఢిల్లీలో అత్యధిక సంఖ్యలో నకిలీ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. యూజీసీ గుర్తింపు లేని 10 సంస్థలు ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ (AIIPHS రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయం). కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్, దర్యాగంజ్. ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం. ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయం. ఏడిఆర్-కేంద్రీకృత న్యాయ విశ్వవిద్యాలయం, రాజేంద్ర ప్లేస్. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, న్యూఢిల్లీ. విశ్వకర్మ స్వయం ఉపాధి ఓపెన్ యూనివర్సిటీ. ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం, రోహిణి. ప్రపంచ శాంతి ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం (WPUNU), పితంపుర,ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్, కోట్ల ముబారక్‌పూర్. ఈ సంస్థలలో చాలా వరకు "విశ్వవిద్యాలయం", "ఐక్యరాజ్యసమితి" లేదా "రాష్ట్ర ప్రభుత్వం" వంటి పదాలను వారి పేర్లలో ఉపయోగించి విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

కేరళలోని రెండు సంస్థలు నకిలీవిగా

ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఇస్లామిక్ ప్రొఫెటిక్ మెడిసిన్ (IIUPM), కోజికోడ్

సెయింట్ జాన్స్ విశ్వవిద్యాలయం, కిషనట్టం ఈ సంస్థలు వైద్య, ఉన్నత విద్య కోర్సుల పేరుతో డిగ్రీలను అందిస్తున్నట్లు చెప్పుకుంటున్నాయి. కానీ వాటికి ఎటువంటి చెల్లుబాటు అయ్యే విశ్వవిద్యాలయ హోదా లేదు.

మహారాష్ట్రలో నాగ్‌పూర్‌లో ఉన్న రాజా అరబిక్ విశ్వవిద్యాలయం అనే ఒకే ఒక నకిలీ విశ్వవిద్యాలయం గుర్తించారు. ఈ సంస్థ మతపరమైన అధ్యయనాల పేరుతో నకిలీ డిగ్రీలను జారీ చేస్తున్నట్లు కనుగొనబడింది.

పుదుచ్చేరిలోని శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌ను యూజీసీ నకిలీదిగా ప్రకటించింది. తిలాస్‌పేట, వఝుతావూర్ రోడ్డులో ఉన్న ఇది ఉన్నత విద్య పేరుతో గుర్తింపు లేని కోర్సులను నడుపుతోంది.

ఉత్తరప్రదేశ్‌లో మొత్తం నాలుగు నకిలీ విశ్వవిద్యాలయాలు గాంధీ హిందీ విద్యాపీఠ్, ప్రయాగ్‌రాజ్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఓపెన్ యూనివర్సిటీ, అలీఘర్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, లక్నో మహామాయ టెక్నికల్ యూనివర్సిటీ, నోయిడా ఈ సంస్థలు విద్యార్థులకు డిగ్రీ, డిప్లొమా కోర్సులను అందిస్తాయి, కానీ ఏవీ యూజీసీ చే అనుమతి పొందలేదు.

పశ్చిమ బెంగాల్‌లో కూడా రెండు నకిలీ సంస్థలు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, కోల్కతా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చ్, ఠాకూర్పుకూర్, కోల్‌కతా ఈ సంస్థలు ప్రత్యామ్నాయ వైద్యం, మూలికా శాస్త్రంలో కోర్సుల పేరుతో నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసేవి.


# క్యాన్సర్ పై యుద్ధం చేయాలి

- కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణ
- ముందే గుర్తిస్తే ప్రాణహాని ఉండదు -డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్
- విద్యతో పాటు వైద్య సేవలు కోసం చిరు ప్రయత్నం, అభినవ్ హై స్కూల్ యాజమాన్యం పారుపల్లి రమణ,స్కూల్ కరస్పాండెంట్ పారుపల్లి అరుణ కుమారి
- విజయవంతంగా ఉచిత కాన్సర్ టెస్ట్ శిబిరం
- అభినవ్ హై స్కూల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణ



**ఖమ్మం బ్యూరో, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** భారతదేశంలో వున్న వ్యక్తి తప్పనిసరిగా ఎదో ఒక వయసులో క్యాన్సర్ పై అవగాహన చేసుకొని కాన్సర్ రోగం పై యుద్ధం చేస్తేనే ఆ మహమ్మారి నిర్మూలన జరుగుతుంది అని కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణ, నగర ప్రముఖులు వైద్యులు యలమంచిలి రవీంద్రనాథ్ తెలిపారు. నగరంలో ప్రముఖ విద్యాసంస్థ అభినవ్ హై స్కూల్ ఆవరణలో స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్ మరియు ఎన్ ఆర్ ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా సంయుక్త సౌజన్యంతో క్యాన్సర్ ఉచిత టెస్ట్ వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. హైదరాబాద్ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సిబ్బంది సహాయంతో దాదాపు 300 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమం ప్రారంభం సభలో పలువురు ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. గూడూరు సత్యనారాయణ, యలమంచిలి రవీంద్రనాథ్ మాట్లాడుతూ నేటి సమాజంలో పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్, జింక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్ ఆహారం తీసుకోవడం ఫలితంగా క్యాన్సర్ విస్తరణ ఈమధ్య కాలంలో బాగా పెరిగింది అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా ప్లాస్టిక్ ద్వారా టీలు కాఫీలు ఎక్కువగా తాగటం, పార్సిల్ ద్వారా ఫుడ్ డెలివరీ లాంటి నూతన ఆహార పోకడలు కూడా ఒక కారణం అని తెలిపారు. చిన్న, పెద్ద వయసు అని లేకుండా ఈవ్యాధి బారిన పడుతున్నారు అని, ఇది ప్రాణాంతక వ్యాధి అయినప్పటికీ ముందుస్తు చెకింగ్ ద్వారా గుర్తించవచ్చు అని తెలిపారు. మనం తినే ఆహారంలో మరింతగా పోషక విలువలు వున్న ఆహారం తీసుకోవాలి అని కోరారు. ఆహారం పూర్తిగా నమిలి తినడం, సరైన టైం కి తగిన మోతాదులో ఆహారం తీసుకోవాలి అని కోరారు. మానిసిక ఒత్తిడి తగ్గించుకోవడం, వ్యాయామం చేయడం లాంటివి మనిషి జీవితంలో తప్పనిసరి అని పేర్కొన్నారు.ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ద్వారా లేదా హాస్పిటల్ లో ముందుగానే వైద్య పరీక్షలు ద్వారా కాన్సర్ ను అరికట్టేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేసిన అభినవ్ హై స్కూల్ యాజమాన్యం పారుపల్లి రమణ, స్కూల్ కరస్పాండెంట్ పారుపల్లి అరుణ కుమారి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా విద్యా సేవలు నిరంతరం చేస్తున్నాం అని, పేద ప్రజలకు మరింతగా ఉచితంగా వైద్య సేవలు అందించాలని నేడు క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశాం అని తెలిపారు. రాబోయే కాలంలో తమ స్కూల్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అవకాశం వున్న మేరకు అందిస్తాం అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్లు వైద్య సేవలు అందించారు. దాదాపు 300 మందికి హైదరాబాద్ నుంచి వచ్చిన కాన్సర్ బస్సులో వైద్య సేవలు అందించారు. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ముందు అక్టోబర్ నెల క్యాన్సర్ నెల అవడంతో స్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి విజ్ఞాన కేంద్రం మేనేజర్ వై శ్రీనివాసరావు , ఎన్ ఆర్ ఐ సంఘం నాయకులు సామినేని నాగేశ్వరావు, బండారు రమేష్, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# రారండోయ్ వేడుక చే(చూ)ద్దాం..!

**నేడు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు**

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు పిలుపు**

**సర్వం సిద్ధం చేసిన శీనన్న అభిమానులు**

**రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలతో హోరెత్తించేందుకు సిద్ధం**

**వేడుకల వివరాలను వెల్లడించిన తుంబూరు దయాకర్ రెడ్డి**



**ఖమ్మం బ్యూరో, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** ఉమ్మడి ఖమ్మంజిల్లా ముద్దుబిడ్డ... లెజండరీ లీడర్ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఈనెల 28వ తేదీన మంగళవారం (నేడు) నిర్వహించేందుకు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఊరువాడా సిద్ధం అయ్యింది. కాంగ్రెస్ నేతలు, పొంగులేటి అభిమానులు సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలతో ఉమ్మడిజిల్లాను హోరెత్తించేందుకు సిద్ధం అయ్యారు. భారీ కటౌట్లు, ప్లెక్సీలు, హోర్డింగ్ లను పురవీధుల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారు. కాగా ఈ వేడుకలకు సంబంధించిన వివరాలను క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వెల్లడించారు.

ఉదయం 09 గంటలకు ఖమ్మం క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ కటింగ్, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా నేలకొండపల్లిలో వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి బైక్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 09.30గంటలకు వరంగల్ క్రాస్ రోడ్డులో, ఉదయం 10గంటలకు కల్లూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో కేక్ కటింగ్ ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు ముదిగొండ మెయిన్ సెంటర్ లో అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11.30గంటలకు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్, మధ్యాహ్నం 12గంటలకు ఖానాపురంలోని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇవేకాక ఇంకా అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కావున ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పొంగులేటి శీనన్న అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరూ ఆయా ప్రాంతాల్లో జరిగే వేడుకలు, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులవ్వాలని దయాకర్ రెడ్డి కోరారు.

# కంతాయపాలెంలో యాదవ సింహ గర్జన

**తొర్రూర్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** మండలం కేంద్రంలోని కంతాయపాలెం గ్రామంలో యాదవుల ఐక్యతను, గొప్పతనాన్ని చాటిచెప్పే లక్ష్యంతో 'యాదవ సింహ గర్జన' పేరుతో సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యాదవ సమాజ అభ్యున్నతే తమ ప్రధాన ధ్యేయమని నిర్వాహకులు పేర్కొన్నారు. సమావేశంలో భవిష్యత్తులో యాదవులు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని యాదవులు కుటుంబ సమేతంగా హాజరై ఐక్యతకు నిదర్శనంగా నిలిచారు. సమావేశం అనంతరం సమాజ సేవా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి 'శ్రీకృష్ణ యాదవ సేన' కమిటీని ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధి, సమాజ ఐక్యత కోసం ఈ కమిటీ పలు సానుకూల కార్యక్రమాలను చేపట్టాలని కమిటీ నిర్ణయించింది.



# లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ సేవా తరుణి ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహణ



**తొర్రూర్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** కె.జి.బి.వి పాఠశాలలో గల పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ ని కావ్య అరవింద్ రెడ్డి సహకారంతో బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులను ఉద్దేశించి డిస్టిక్ జిఎల్టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వేలూరి శారద , డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ లయన్ డాక్టర్ ఎస్ నాగవాణి మాట్లాడుతూ ఎగ్జామ్స్ దగ్గరకు వస్తున్న సమయంలో ఆరోగ్యం పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేసి ఒక పద్ధతిగా పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలో వివరించి చెప్పడం జరిగింది. ఇచ్చినటువంటి ఆల్ ఇన్ వన్ బుక్స్ ని సద్వినియోగం చేసుకొని అటు పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, సొంత ఊరికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని తెలియజేశారు అనంతరం పాఠశాలలో పనిచేసే ఆయాలకు చీరలు పంపిణీ చేశారు , ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ మేడం శైలజ డిస్టిక్ జిఎల్టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వేలూరి శారద డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ లయన్ డాక్టర్ ఎస్ నాగవాణి లయన్ ఉమా రెడ్డి , లయన్ సబిత , లయన్ విమల పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సి.పి.ఎం. సంతకాలు సేకరణ...



**ఖమ్మం బ్యూరో, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల 55వ డివిజన్ వేణుగోపాల్ నగర్ రోడ్డుకు ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, ట్రాఫిక్ నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ వేణుగోపాల్ నగర్ 1 శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యులు గాలి వెంకటాద్రి మాట్లాడుతూ వేణుగోపాల్ నగర్ లో ఎన్ఎస్పి కాలువ పక్కన ఉన్న రోడ్డుకు ట్రాఫిక్ పెరిగిందని దానివల్ల చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్డు మీదకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి వచ్చిందని తరచూ యాక్సిడెంట్లు కూడా జరుగుతున్నాయని అన్నారు. ఇల్లందు రోడ్డు నుండి ఖమ్మం బైపాస్ రోడ్డు లోగల కొత్త బస్టాండ్ కి వెళ్లడానికి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సిగ్నల్ పడితే రెండు నిమిషాలు ఆలస్యం అవుతుందని ట్రాఫిక్ మొత్తం వేణుగోపాల్ నగర్ మీదుగా మలుతుందని, టూ వీలర్స్ ,ఆటోలు, కార్లు కూడా ఈ రోడ్డు గుండా అతి వేగంగా వెళ్లడం వల్ల ఆ రోడ్డు పక్కన ఉన్నటువంటి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురిగావాల్సి వస్తుందని వెంటనే అధికారులు స్పందించి ఆ రోడ్లో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఎన్ఎస్పీ కాలువ మీద వరకు డివైడర్లు నిర్మిస్తే ఈ ట్రాఫిక్ సమస్య తీరుతుందని వారు అధికారులను కోరారు. అలాగే ఈ ప్రాంతంలో కోతులు మరియు కుక్కల బెడద తీవ్రంగా ఉందని ఈ సమస్య వల్ల ప్రజలు ఇళ్లల్లో పని చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది ని అక్కడ ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వేణుగోపాల్ నగర్ రోడ్డుపై హై టెన్షన్ కరెంట్ పోలు ఉండటంవల్ల కూడా ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతుందని కరెంట్ పోల్సు తొలగించాలని డిమాండ్ చేశారు. వేణుగోపాల్ నగర్ లో అసంతృప్తిగా ఉన్న డ్రైనేజీ ని కూడా పూర్తి చేయాలని, ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద రోడ్డు అడ్డంగా తవ్వి పైప్ లైన్ వేయడం వల్ల గుంటలు ఏర్పడ్డాయని వెంటనే ఆ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని ఈ సందర్భంగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు శాఖ కార్యదర్శి దంతాల నరసింహారావు, పార్టీ సీనియర్ సభ్యులు సంగయ్య, భాస్కరరావు, కేశవులు, సుజాత, సునీత, వెంకన్న, యాదగిరి మురహరి, మాచర్ల గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.



# ఆంజనేయస్వామి ఆలయ రక్షణ కవచ నిర్మాణానికి శ్రీకారం



**గీసుకొండ, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** కొమ్మాల గ్రామంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ ప్రహరి గోడ నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రహరి గోడ నిర్మాణం కోసం దాతగా అల్లం బాల కిషోర్ రెడ్డి ముందుకు వచ్చి సుమారు రూ.3 లక్షల వ్యయంతో ఈ పుణ్యకార్యాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్ హాజరై కార్యక్రమాన్ని మరింత శోభాయమానంగా మార్చారు.ఈ కార్యక్రమంలో కొమ్మాల గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం



**నర్సంపేట, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** నర్సంపేట నియోజకవర్గం నర్సంపేట పట్టణంలోని సిటిజన్ క్లబ్ లో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నర్సంపేట పోలీస్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి, ఈస్ట్ జోన్ డిసిపి,ఏసిపి, హాజరయ్యారు. రక్తదాన శిబిరంలో పోలీసు వారి పిలుపు మేరకు రక్తదానం చేసి,యువకులు, స్థానికులు తదితరులు పాల్గొని రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.వీరందరికీ పోలీస్ అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెన్షనర్ల మరణాలను ఆపండి-ఎస్జిపిఏటి ధర్నాలో వక్తలు

## -భారీగా హాజరైన పెన్షనర్లు
## -అధికారులకు వినతి

**ఖమ్మం బ్యూరో, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** పెన్షనర్ల బకాయిలను సత్వరం చెల్లించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఎస్ జిపిఏటి ఆధ్వర్యంలో జరిగిన పెన్షనర్ల ధర్నాలో పలువురు వక్తలు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల వివక్షాపూరిత వైఖరిని అవలంభిస్తుందని -ఆర్థిక ఇబ్బందులకు గురి చేసి వారి మరణాలకు కారణమవుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) పిలుపు మేరకు ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్ లో పెన్షనర్లు ధర్నాను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద -సంఖ్యలో పెన్షనర్లు తరలి రాగా ధర్నాను ఎస్జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి వి.మేరీ ఏసుపాదం ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య "అధ్యక్షతన జరిగిన ధర్నా లో పెన్షనర్ల సంఘాల నేతలు ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు మాట్లాడుతూ పెన్షనర్ల బకాయిలు చెల్లింపులో ప్రభుత్వ విధానం సరిగ్గా లేదన్నారు. దాదాపు 18 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన ఏ ఒక్కరికి ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఉద్యోగ విరమణ బకాయిలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పలువురు పెన్షనర్లు తనువు చాలించారని తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత వచ్చిన డబ్బుకు -సంబంధించి పెన్షనర్లకు పలు ప్రణాళికలు ఉంటాయని వారి ఆశలు, ఆలోచనలపై ప్రభుత్వం నీళ్లు చల్లటమే కాకుండా ఇబ్బందులు పెడుతుందన్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును సైతం ప్రభుత్వాలు వాడుకుంటున్నాయని ఆరోపించారు. పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం కావని బహుముఖ పోరాటాలకు పెన్షనర్లు సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. పెద్ద పెద్ద గుత్తేదారులకు ఇతర అవసరాలకు కోట్లు ఖర్చు చేస్తున్న -రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న సొమ్ము ఇచ్చేందుకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. పెన్షనర్లు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని ప్రభుత్వం ముందు ఎటువంటి డిమాండ్స్ ఉంచడం లేదని కేవలం తాము దాచుకున్న సొమ్ము తమకు రావాల్సిన ఉద్యోగ విరమణ బకాయిలు ఇవ్వమంటున్నా పాలకులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. సమస్య పరిష్కారానికి సంఘటిత ఐక్య పోరాటాలే మార్గమని -ఆందోళనను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అందుకు ప్రతి ఒక్క పెన్షనర్ సిద్ధం కావాలని కోరారు. -అనంతరం కలెక్టరేట్లో డిఆర్వో పద్మశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ(ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. విజయ్, మాజీ ప్రధాన కార్యదర్శి వి. మనోహర్రాజు, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె కరీం, టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి ఆవుల అశోక్, విశ్రాంత అధ్యాపక సంఘ నాయకులు ఎ. విద్యాసాగర్, మార్కెట్ కమిటీ ఉద్యోగ సంఘ నాయకులు జల్లా -వెంకటేశ్వర్లు, ఎస్జిపిఏటి జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఐవి భాస్కరాచారి, శ్యాంసుందర్, జి. లక్ష్మయ్య, భద్రయ్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాసరావు, పెదమళ్ల సత్యనారాయణ, కె. శరత్బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, బోజడ్ల కృష్ణకుమారి, తాడి అంజలి, లక్ష్మి సుజాత, అన్నమ్మ, రాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, నాగప్రసాద్, కృష్ణారావు, సుధాకర్, రామనాథం, -పుల్లయ్య, సుధాకర్, ఎండి హుస్సేన్, వెంకటప్పారావు, ఆళ్ల రామారావు, దుగ్గినేని శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు తాటి వెంకటేశ్వర్లు -తదితరులు పాల్గొన్నారు.









# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

## ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ- భీమ్ సింగ్



**సూర్యాపేట, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి చివరి వారంలో జరుగుతాయని, ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ భీమ్ సింగ్ తెలిపారు. సోమవారం సూర్యాపేటజిల్లాలోని వివిధ కళాశాలలను, ఆకస్మిక తనిఖీ చేశారు.అందులో భాగంగా నెమికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలనుఆకస్మికంగా పరిశీలించి విద్యార్థులు అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని అన్ని కళాశాలలను పరిశీలిస్తున్నామని తెలిపారు అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని కళాశాలలను కూడా తనిఖీ చేసి విద్యార్థులకు తగు సూచనలు చేస్తూ పరీక్షలకు సిద్ధం చేసేవిధంగాఅధ్యాపకులతోసమావేశాలు,ఏర్పాటుచేస్తున్నారు.గత ఏడాది నిర్వహించిన విధంగానే 90 రోజుల ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు నవంబర్ నుంచి డిసెంబర్ వరకుప్రత్యేకంగా విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకుంటామన్నారు.జనవరిలో పునర్ చరణ తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులను సిద్ధం చేస్తామన్నారు.ఇప్పటివరకు ప్రయోగ పరీక్షలకు సంబంధించిన విషయాలను పరిశీలించి ప్రతి కళాశాలకు ల్యాబ్ ఎక్విప్మెంట్ కోసం నిధులు మంజూరు చేస్తామన్నారు ఫిబ్రవరిలో ప్రయోగ పరీక్షలు మొదటి వారంలో ప్రారంభమై మూడో వారం చివరి వరకు పూర్తవుతాయని అదే విధంగా చివరి వారంలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గత ఏడాది విద్యార్థులను కళాశాలలో చేర్చుకునేందుకు,నిర్వహించినట్లుగానే ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ప్రభుత్వ కళాశాల నుంచి అధ్యాపకులను పరిసర గ్రామాలలోని ఉన్నత పాఠశాలను సందర్శించి,విద్యార్థులవివరాలను సేకరిస్తారన్నారు వారితో మమేకమై పాఠ్యాంశ బోధనలోను ముందుంటారని పేర్కొన్నారు. విద్యార్థులను మార్చి నుంచే ప్రభుత్వ కళాశాలలో చేర్చుకునే విధంగాచర్యలు చేపడతామన్నారు. ఈ ఏడాది లక్ష వరకు రాష్ట్రంలో అడ్మిషన్లు వచ్చాయని వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామన్నారు ప్రధానాచార్యులుకూడా అధ్యాపకుల పట్ల శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని కోరారు.విద్యార్థులు చదువుకున్నప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థుల కోసం అధ్యాపకులు చేయాలని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులంతా పేద విద్యార్థులేనని, వారికోసం ఎన్నో సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు ఈ ఏడాది నవంబర్ నుంచి విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించేందుకు ప్రయోగాత్మకంగా ఉమ్మడి,జిల్లాలోనిఅన్నికళాశాలలను ఎంపిక చేసామన్నారు త్వరలో డిజిటల్ బోర్డులు మిషనరీ సామాగ్రి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మారం హరిప్రసాద్ అధ్యాపకులు జి. వెంకటేశ్వర్లు,దశరథ, అశోక్, నాగార్జున,లక్ష్మయ్య,లింగయ్య సైదాచారి, లైబ్రేరియన్ గురువారెడ్డి,అమల, శ్రావణి, అతిధి అధ్యాపకులు మమత మరియు సునీత నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మద్యం దుకాణాల టెండర్ లక్కీడ్రా

### నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలి
### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
### ఏ.బి వేడుకల మందిరంలో ఏ 4 మద్యం దుకాణాల టెండర్ లక్కీడ్రా



**మహబూబాబాద్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలో 2025-2027 సంవత్సరం వరకు కొనసాగనున్న మద్యం షాపుల టెండర్ల ఓపెన్ డ్రా జిల్లా కేంద్రంలోని సబ్ జైల్ దగ్గర ఉన్న ఏ.బి వేడుకల మందిరంలో సోమవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 61 దుకాణాలు ఉన్నాయని, సెప్టెంబర్ 26వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్ల స్వీకరణ మొదలుపెట్టామని, దరఖాస్తులు ఈ నెల(అక్టోబర్) 23వ తేదీ వరకు స్వీకరించామని తెలిపారు. మొత్తం దరఖాస్తులు 1800 వచ్చాయని వెల్లడించారు. డిసెంబర్ 01 వ తేదీ నుంచి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ కుమార్, ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నాగేశ్వర్ రావు, బిక్షపతి, అశోక్ మరియు ఎస్సై లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మా అమృతం కిచెన్- కేటరింగ్ ను ప్రారంభించిన పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ



**కొండాపూర్, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మా అమృతం కిచెన్ - కేటరింగ్ ను ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ హాజరై స్థానిక నాయకులతో కలసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మా అమృతం కిచెన్ - కేటరింగ్ యాజమాన్యం శిరీష్, ప్రవీణ్ లకు పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ , హమీద్ పటేల్ శుభాకాంక్షలు. తెలుపుతూ మరిన్ని శాఖలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, సుద్దపల్లి విజయకృష్ణ, గోపాల్ రెడ్డి, మధు ముదిరాజ్, రమణ, శ్రీనివాస్, రాజ్, వినోద్, మంజు, హేమ, సరస్వతి, జోషి, యాదగిరి, హరి తదితరులు పాల్గొన్నారు.

# కంట్రీ ఓవేన్ బేకరీ ని ప్రారంభించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**కూకట్ పల్లి, 27 అక్టోబర్ (కెరటం న్యూస్):** శేర్లింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్ మెయిన్ రోడ్ లో అభిలాష్. అరవింద్ లు నూతనంగా ఏర్పాటు చేసుకున్న "కంట్రీ ఓవెన్" బేకరిని శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిధిగా హాజరై స్థానిక డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు. ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా బేకరీ యాజమాన్యానికి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతూ మీరు ఏర్పాటు చేసుకున్న ఈ బేకరీ షాప్ ద్వారా కస్టమర్లకు నాణ్యమైన ఐటమ్స్ అందజేస్తూ వారి ఆదరాభిమానాలను పొందాలన్నారు. షాపు నిర్వాహకులు మాట్లాడుతూ అందరికీ బెస్ట్ క్వాలిటీ ఇవ్వాలనే ఉద్దేశంతో ఇక్కడ "కంట్రీ ఓపెన్" బేకరీ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు మా వద్ద పఫ్స్. కర్రీ పఫ్స్. కేకులు. మొదలగున్నవి మంచి క్వాలిటీతో లభ్యమవుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు బేకరీ షాపు యాజమాన్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.